క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లెక్చరర్స్‌కాలనీ, సీతారామాపురం, ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు. 11కేవీ గణేష్‌నగర్, పెద్దఅంబర్‌పేట టౌన్, మన్సూరాబాద్, వాంబేకాలనీ, బీరప్పగడ్డ, హైకోర్టు కాలనీ, విద్యుత్‌నగర్, కొత్తపేట, లక్ష్మీనగర్, మోహన్‌నగర్, విజయపురి, ఆర్.కే.పురం, మారుతీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు



అనాథకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గిరి

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ దివ్యాంగుల ఆశ్రమానికి చెందిన మానసిక దివ్యాంగుడు వెంకటేశ్(35) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి అన్నీతానై సంప్రదాయబద్ధంగా తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో మానసిక దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్



మహేశ్వరం: మండల బహుజన సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడిగా కోళ్లపడకల్ గ్రామానికి చెందిన కట్టెల రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాజశేఖర్‌కు నియామక పత్రాన్ని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ఇన్‌చార్జి సత్యనారాయణలు అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ...బీఎస్పీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై బీఎస్పీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ చారి, నియోజకవర్గ మహిళ కన్వీనర్‌గా ఇందుమతి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నర్సింహ, నాయకులు భాగ్యరాజ్, అరుణ్, కిరణ్ పలువురు పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేత



రాచులూరులో విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని రాచులూరులో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం రాత్రి ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు వైఎస్సార్‌టీపీ నాయకుడు చిట్టె శ్రీకాంత్ రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. సోమవారం కందుకూరులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు ఎంపీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు మన్నే సురేందర్ రూ.15 వేలు నగదును ట్రోఫీతో పాటు అందజేశారు.

గండిచెరువు అభివృద్ధికి నిధులివ్వండి

ఎమ్మెల్యే మంచిరెడ్డికి గ్రామస్తుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్: గండిచెరువు గ్రామానికి మంజూరు చేసిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ పూజారి చక్రవర్తిగౌడ్ సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీరంగనాథస్వామి కల్యాణ మండపం, ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆశన్నగారి మల్లారెడ్డి కుమారులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనందీశ్వర్‌రెడ్డి రూ.2లక్షల విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా షెట్టర్ నిర్మాణానికి విరాళం అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్‌గుప్తా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'ఆదర్శం'

- మోడల్ స్కూల్‌లో విద్యాబోధన అదుర్స్
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఇంగ్లిష్ మీడియం స్కూల్
- ప్రవేశాలకు పెరుగుతున్న తీవ్ర పోటీ
- ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- 6, 7, 10వ తరగతి ప్రవేశాలకు ఏప్రిల్ 16న ఎంట్రన్స్ ఎగ్జామ్

మహేశ్వరం: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన ఉచిత విద్యా బోధన అందిస్తోంది. గతేడాది మహేశ్వరం నుంచి కళాశాల, పాఠశాల విద్యార్థులు జిల్లా ర్యాంకులు సాధించారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠశాల అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువడింది. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. త్వరలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించనున్నారు.

పదిలో 96 శాతం ఉత్తీర్ణత..

మహేశ్వరం మోడల్ స్కూల్‌లో గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 96 శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం 2016–17 లో మోడల్ స్కూళ్ల (ఆదర్శ పాఠశాలలు) నెలకొల్పింది. మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండల కేంద్రంలో, కందుకూరు మండలానికి నేదునూరు గ్రామంలో మోడల్ స్కూల్స్ ఉన్నాయి.

విద్యార్థులకు వసతులు ఇలా..

ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అనేక వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన అందిస్తున్నారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు, ల్యాబ్ సౌకర్యం, అధునాతన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతి గదులు, విశాలమైన ఆట స్థలం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్, ఎంసెట్ కోచింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించబడును. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. స్కౌట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ఎన్‌సీసీ శిక్షణ ఏర్పాటు కానుంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు స్కూల్‌కి చెందిన 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 2021–22 విద్యా సంవత్సరంలో స్కూల్ నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మొదటి అంతస్తు భవనం నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. త్వరలో మంత్రి చేతుల మీదుగా భవనాలు, హాస్టల్ ప్రారంభించనున్నారు. స్కూల్ నెట్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ కంపెనీ సహకారంతో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో 20 మినీ ల్యాప్‌టాప్‌లు, ప్రొజెక్టర్‌తో డిజిటల్ ట్యాబ్‌లతో విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో సుమారు 722 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. హెచ్‌ఎండీఏ నిధులు రూ.14 లక్షలతో పాఠశాలలో మొక్కలు నాటడం, సుందరీకరణ పనులు కూడా పూర్తయ్యాయి.



మహేశ్వరం మోడల్ స్కూల్ భవనం

దరఖాస్తు విధానం

తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 10 నుంచి మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఫిబ్రవరి 15వరకు చివరి గడువును పొడిగించారు. ఏప్రిల్ నెలలో ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ 16న అర్హత పరీక్ష ఉంటుందని విద్యాధికారులు తెలిపారు. అనంతరం ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు పాఠశాలను సందర్శించాలన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కొనసాగుతున్నాయి. దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 15వ తేదీ వరకు అవకాశం కలదు. ప్రభుత్వం విద్యార్థులకు డిజిటల్ తరగతులు, లైబ్రరీ, క్రీడా మైదానం, హాస్టల్ వసతి, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సౌకర్యంతో కంప్యూటర్ బోధన, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తోంది. సుమారు రూ.4 కోట్ల నిధులతో స్కూల్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా శిక్షణ తరగతులు, పాఠశాల ప్రాంగణం పర్యవేక్షణ ఉంటుంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి.

– బి.ధనుంజయ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మహేశ్వరం

ఘనంగా సంక్రాంతి

కందుకూరు: మండల పరిధిలో సంక్రాంతి, కనుమ పండుగలను ఆది, సోమవారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు, యువతులు ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి రంగులు అద్ది గొబ్బెమ్మలు పెట్టగా, చిన్నారులు పతంగులను ఎగురవేయడంలో పోటీ పడ్డారు. పిండి వంటలను ఆస్వాదిస్తూ పండుగను సంతోషంగా గడిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేత పరుశురామ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా చిట్టి సత్తయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పర్వతాలు, మల్లేశ్‌లు నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో విన్నర్‌గా జి. పరుశురామ్ జట్టు, రన్నర్‌గా పిహెచ్. పర్వతాలు జట్లు గెలుపొందాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలమూరు లక్ష్మీపాండు, నాయకులు రాజేందర్, జగన్, ఈదయ్య, యువకులు కిరణ్, లింగం, రమేశ్, శ్యామ్, రాజు, శ్రీను, బాబు పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం

ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్



సమావేశంలో పాల్గొన్న నేతలు

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తామని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎంసీపీఐ పార్టీ నుంచి అభ్యర్థిని బరిలో నిలిపేందుకు కార్యకర్తలను సిద్ధ చేస్తున్నామని వెల్లడించారు. గ్రామం నుంచి డివిజన్ స్థాయి వరకు కమిటీలు వేసి బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైఖ్య బాలాపూర్ మండల కార్యదర్శిగా పి.వరుణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శిగా వి.శ్రీకాంత్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి బి.సుజాత, నాగేంద్రమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

మీర్‌పేట: ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి కాలనీవాసులకు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా సోమవారం స్వచ్ఛంద సంస్థ, కార్పొరేషన్ సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి కాలనీవాసులకు తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛతలో డివిజన్‌ను ముందుంచేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, రీ సైక్లింగ్ అయ్యే వస్తువులను వాడి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె కాలనీవాసులను కోరారు.

రజక సంఘం భూమిని రక్షిస్తాం: మల్‌రెడ్డి



దీక్షలో భూమి పత్రాలను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో రజక సంఘానికి కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించుకుని జీఓ 59 కింద రెగ్యులరైజ్ చేసుకోవాలని చూస్తున్నారని, రజకుల భూమి ఆక్రమణకు గురి కాకుండా ఎంపీ రేవంత్‌రెడ్డి నిధులతో చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బాగ్ హయత్‌నగర్‌లోని సర్వే నంబర్.207లో తమ భూమిని రక్షించాలని రజకులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ... 59 జీఓ ద్వారా ప్రభుత్వం రజకుల భూమిని అమ్ముకోవాలని చూస్తోందని, ఏళ్ల తరబడి రజకుల ఆధీనంలో ఉన్న ఈ భూమికి చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు గతంలో రూ.5లక్షలు మంజూరైనా అధికారులు అంచనాలు ఇవ్వలేదన్నారు. రజకుల భూమిని రక్షించేందుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు తెలుపుతుందని, ఎంత ఖర్చయినా ఎంపీ నిధులు ఇచ్చి ప్రహరీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యాంచరణ్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, మాతంగి యాదగిరి, సరన్న, తోకోటి కిరణ్, గడ్డం వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఓటమి.. గెలుపునకు నాంది

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఓటమి.. గెలుపునకు నాంది అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దూసకల్‌లో నిర్వహించిన డీపీఎల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చందు, కుమార్, హైమద్, ఆనంద్‌గౌడ్, హరికుమార్, అంజిగౌడ్, లక్ష్మయ్య, కిట్టు, ఫయాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

షాద్‌నగర్: నిరుపేదల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ రాజీలేని పోరాటం చేస్తుందని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో బీఎస్పీ అధినేత్రి మాయావతి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి నేటికీ పేదలు ఇబ్బంది పడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూపీలో నాలుగుసార్లు పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు.

ఘన నివాళి



మంజుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఏర్పుల మంజుల ఇటీవల అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి సోమవారం గ్రామంలో ఆమె చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామయ్య మృతి చెందడంతో వారి పార్థివదేహానికి కూడా నివాళులర్పించి, కుటుంబానికి ఆసరాగా ఉండటానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు అల్లె కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, ఏర్పుల శ్రీశైలం, రమేశ్, రాజు, ఆనంద్, శశికాంత్ నాయక్, సంగారెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, నర్సింగ్, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎంపీపటేల్‌గూడ మాజీ ఎంపీటీసీ పాతూరి రాజలింగం గౌడ్ (61) సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. రాజలింగం గౌడ్ స్వగ్రామం ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ. ప్రజలకు ఎంతో సేవలందించి సౌమ్యుడిగా కాంగ్రెస్ పార్టీలో పనిచేశాడు. ఆయన మృతికి కాంగ్రెస్‌పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

తవ్విన రోడ్డును తిరిగి నిర్మించాలి



కమలానగర్‌లో రోడ్డును తవ్వి అలాగే వదిలేసిన దృశ్యం

వనస్థలిపురం: డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డును తిరిగి నిర్మించాలని కమలానగర్ కాలనీవాసులు కోరుతున్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్ కాలనీ రోడ్డు నంబర్.17లో ఏడాది క్రితం పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్డును తవ్వారు. అయితే పైప్‌లైన్ వేసి ఏడాది గడుస్తున్నా రోడ్డును తిరిగి నిర్మించక పోవడంతో ఆ దారిన వెళ్లే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును తిరిగి నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎడ్ల బండ్ల ఊరేగింపు

షాద్‌నగర్‌రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో ఆదివారం ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ బండ్లను, పశువులను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది పండుగ సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయతీగా వస్తోందన్నారు.

మహేశ్వరంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం

పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీనివాస్


బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ అన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి జన్మదినాన్ని పురస్కరించుకుని బడంగ్‌పేటలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోజు రోజుకు బీఎస్పీకి ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ తరపున పోటీ చేస్తానని ప్రకటించారు. బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ఇన్‌చార్జి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌చారి, ఉపాధ్యక్షుడు భాగ్యరాజ్, మహిళా కన్వీనర్ ఇందుమతి, బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి కిరణ్, రాజశేఖర్, అరుణ్‌కుమార్, సురేశ్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, అనిత, లలిత, సరిత, ఇందిర రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

కొండరాయి దొర్లకుండా ప్రత్యేక చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బండరాయిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వీరన్నగుట్టపై పగుళ్లు పట్టి దొర్లటానికి సిద్ధంగా ఉన్న కొండరాయి దొర్లకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టపై రామాలయం ప్రక్కన పగుళ్లతో దొర్లటానికి సిద్ధంగా ఉన్న బండరాయితో పెను ప్రమాదం ఉందని స్థానికుల ఫిర్యాదుతో సోమవారం ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండరాయి దొర్లితే గుట్ట కింది భాగంలో ఉన్న ఇండ్లపై పడి పెను ప్రమాదం సంభవించే అవకాశముందని, పరిస్థితి తీవ్రత దృష్ట్యా బండరాయి దొర్లకుండా షార్ట్ టెండర్‌ను పిలిపించడం జరిగిందన్నారు. బండరాయి చుట్టూ సీసీతో బెడ్స్, ఐరన్ రాడ్స్‌ను ఏర్పరచి చుట్టూరా ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, బస్తీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ గణేశ్



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోళ్ల గణేశ్, మహేష్‌చారీ డిమాండ్ చేశారు. బీఎస్పీ అధినేత్రి మాయవతి జన్మదిన వేడుకలను ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యా, వైద్యం, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రకారం అవకాశాలు కల్పించాలని కోరారు. రిజర్వేషన్లు పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు దార యాదగిరి, ప్రధాన కార్యదర్శి గోపగల్ల దాస్, కోశాధికారి కొండ్రు రఘుపతి, నాయకులు శాంత, మచ్చ మహేందర్, శ్రీనివాస్, జగన్, ప్రహ్లాద్, సైదులు, జగదీష్, కిషన్, గణేష్, గణేష్, సుధాకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు .

రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక నిధులు



కేశంపేట: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం రవాణా వ్యవస్థకు ప్రత్యేక నిధులను విడుదల చేస్తూ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని లేమామిడి శివారులోని గాంధీ శంకర్‌పల్లి వద్ద తలకొండపల్లి శివారు నుంచి రూ.6.5కోట్ల నిధులతో చేపడుతున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, లేమామిడి సర్పంచ్ శ్రీశైలంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, విశ్వనాథం, లక్ష్మయ్య, అంజిరెడ్డి, చంద్రశేఖర్, దశరథ, యాదగిరిరావు, వెంకటయ్య పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

షాద్‌నగర్: ప్రజలు దైవ చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని గిరాయిగుట్ట గ్రామంలో లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా జాతరను నిర్వహించారు. ఈ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.